సాక్షి నల్లగొండ

శుక్రవారం, 6, అక్టోబర్, 2023



రెగ్యులరైజ్ చేయాలి
తమను రెగ్యులరైజ్ చేయాలని గురువారం ఎంజీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. - 8లో



యాదవుల పక్షపాతి కేసీఆర్
యాదవుల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. - 10లో



క్రీడల్లోనూ రాణించాలి
విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. - 0లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి నాటక ప్రదర్శనలు

నల్లగొండ: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవిత చరిత్ర– లక్ష్యాలపై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి సంఘం శరణం గచ్ఛామి ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5గంటలకు మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 8వ తేదీ సాయంత్రం 5గంటలకు నల్లగొండలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో, 9వ తేదీ సాయంత్ర నకిరేకలోని సువర్ణ ఫంక్షన్ హాల్లో, 9న సాయంత్రం దేవరకొండలోని సాయి శివ ఫంక్షన్ హాల్ నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేల ద్వారా ప్రారంభించే ఈ ప్రదర్శనలను ప్రజలు తిలకించాలని కోరారు.

సీపీఎం పోటీకి సిద్ధం



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అన్ని నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగార్జున సయ్యద్‌హాషం, ఎండీ.సలీం, వెంకటరమణారెడ్డి, సత్తయ్య, తుమ్మల పద్మ, సైదులు, భిక్షం, శ్రీకర్, అంజయ్య వెంకన్న సరోజ, లింగస్వామి, యాదయ్య, నర్సింహ, రవీందర్ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



రాస్తారోకో చేస్తున్న రైతులు

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగం లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులందరికీ లక్ష రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులతో కలిసి నల్లగొండ పట్టణంలోని కెనరా బ్యాంకు సమీపంలో ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతోనే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ బ్యాంకు మేనేజర్‌ను కలెక్టరేట్‌కు పిలిచి మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు జగాల్‌రెడ్డి, అంజయ్య, రుద్రాక్ష రవి, ముత్తయ్య, యాదయ్య, లింగయ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎంజీయూ(నల్లగొండ రూరల్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ విజృంభన రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన జాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11న టీఎన్‌జీఓ భవన్‌లో విద్యా రంగ సమస్యలపై నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆయన ఎంజీయూలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమలో బాపూరావు, అశోక్‌రెడ్డి, లింగరాజు, శ్రవన్, మల్లేష్, రవి, వెంకన్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న ఆశా వర్కర్లు, నాయకులు

కలెక్టరేట్ ముట్టడి

నల్లగొండ టౌన్: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమ్మెలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆశాలను పోలీసులు నిలువరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి.మహేశ్వరి, సైదులు, తవిటి వెంకటమ్మ, సత్యనారాయణ, దయానందన్, చంద్రమౌళి, గణేష్, స్వర్ణ, విశ్వేశ్వరి, శైలి, వెంకటమ్మ, పార్వతమ్మ, జయమ్మ, పద్మ, సలీమా, సుజాత, ధనలక్ష్మి పాల్గొన్నారు.

‘కమలం’ కమిటీల్లో నలుగురు మనోళ్లు

- స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా రాజగోపాల్‌రెడ్డి
- గంగిడి మనోహర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లుకు బాధ్యతలు
- 20 రకాల కార్యక్రమాల నిర్వహణకు పదాధికారుల సమావేశంలో నిర్ణయం
- పార్టీ మారబోనని స్పష్టత ఇచ్చిన రాజగోపాల్‌రెడ్డి



రాజగోపాల్‌రెడ్డి



బూర నర్సయ్యగౌడ్



గంగిడి మనోహర్‌రెడ్డి



కాసం వెంకటేశ్వర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధతపై బీజేపీ వేగం పెంచింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో రాష్ట్ర నాయకత్వం 14 రకాల కమిటీలను ఏర్పాటు చేసింది. వాటిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు నాయకులకు కీలక బాధ్యతలను అప్పగించింది. అందులో ముఖ్యంగా అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అప్పగించింది. ఇప్పటికే ఆశావహుల నుంచి కమలం పార్టీ దరఖాస్తులను స్వీకరించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు నుంచి ఐదుగురు వరకు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి, టికెట్ ఇవ్వాల్సిన అభ్యర్థి పేరును బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీకి సిఫారసు చేసే స్క్రీనింగ్ కమిటీకి చైర్మన్‌గా రాజగోపాల్‌రెడ్డిని నియమించింది. మరోవైపు ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులను, కార్యకర్తలను చైతన్య పరుస్తూ ప్రజల్లోకి వెళ్లడంలో కీలకంగా వ్యవహరించే అజిటేషన్ కమిటీ కన్వీనర్‌గా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. అలాగే సోషల్ ఔట్ రీచ్ కమిటీ కన్వీనర్‌గా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను నియమించింది. పార్టీ జాతీయ నేతలు వచ్చినప్పుడు, రాష్ట్ర స్థాయిలో బహిరంగ సభలు నిర్వహించే కమిటీకి చైర్మన్‌గా బీజేపీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌ని నియమించగా, జిల్లా నుంచి పార్టీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లును జాయింట్ కన్వీనర్‌గా నియమించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదంతో వీరిని నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు.

పార్టీ మారేది లేదు..

తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఖండించారు. గురువారం సాయంత్రం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని వస్తున్న వార్తలు ఎవ్వరూ నమ్మవద్దన్నారు. గెలిచినా, ఓడినా ఈ ఎన్నికల్లో బీజేపీ నుంచే పోటీచేస్తానని, అందుకు అందరు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం

జిల్లాలో బీజేపీ ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించింది. నల్లగొండ జిల్లాకు కర్నాటకకు చెందిన కేంద్ర మంత్రి శోభా కర్లాందజే నియమితులయ్యారు. సూర్యాపేట జిల్లాకు కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించింది. గురువారం జరిగిన రాష్ట్ర పార్టీ పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశంలో వారిని పార్టీ జిల్లా అధ్యక్షులకు, పదాధికారులకు పరిచయం చేసి, జిల్లాల్లో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించింది.

భారీగా సభలు, సమావేశాలు

ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పెద్ద ఎత్తున బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాల నిర్వహణకు ప్లాన్ చేస్తోంది. ఎన్నికల నేపథ్యంలో 20 రకాల కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగిందనే చర్చ ఈ సమావేశంలో వచ్చినట్లు తెలిసింది. ఇదే జోష్‌ను కొనసాగించడం, ఎన్నికల్లో గెలుపొందేందుకు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల పర్యటనలను అన్ని జిల్లాల్లో విస్తృతంగా నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇందులో భాగంగా ఏయే జిల్లాల్లో ఏయే సమావేశాలు నిర్వహించాలి, ఎవరెవరి సమావేశాలను నిర్వహించాలనే దానిపై శుక్రవారం జరిగే పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో చర్చించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో.. వచ్చే నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ లేదంటే అమిత్‌షా సభ నిర్వహించనున్నట్లు తెలిసింది. దీనిపై శుక్రవారం జరిగే సమావేశంలో స్పష్టత రానుంది.

లేనిపోని ఆరోపణలు చేస్తే సహించం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



కంటతడి పెడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ: లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని మండలాలు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలను టీపీసీసీ అనుమతితోనే నియమించామన్నారు. కావాలనే కొందరు సోషల్ మీడియా ద్వారా తనపై, మాజీ మంత్రి జానారెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ అవమానపరుస్తున్నారని కంటతడి పెట్టారు. అక్రమాస్తులను సంపాదించానని, బీఆర్‌ఎస్ పార్టీకి ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నానంటూ కావాలనే కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీగా, జెడ్పీటీసీగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా రెండుసార్లు, ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నానని తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తాను 30 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని, పేర్కొన్నారు. టికెట్ ఇవ్వకుంటే మిర్యాలగూడకు జానారెడ్డిని రానియ్యమని తరిమికొడ్తామని కొందరు అంటున్నారని, అలాంటి వారు పద్ధతి మార్చుకోకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీపీసీసీ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, రామలింగయ్యయాదవ్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోవగాని మాధవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.సైదులు, నాయకులు పి.వెంకన్న, కాంతారెడ్డి, బసవయ్యగౌడ్, బక్కారెడ్డి, సలీం, శ్రీనివాస్, సత్తిరెడ్డి, హాజీ, లింగయ్య, వినోద్, చాంద్‌పాషా, లలిత, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె విరమణ

నల్లగొండ టౌన్: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించినందుకు సమ్మెను విరమిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు గురువారం నల్లగొండ సీడీపీఓకు లేఖ అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ ఉద్యోగులు దొడ్డి కొమరయ్య భవన్‌లో స్వీట్లు పంచుకున్నారు.

సర్కార్ బడుల్లో అల్పాహారం

- సీఎం కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పేరిట కొత్త పథకం
- ఆరు పాఠశాలల్లో నేడు ప్రారంభం
- మొదట నియోజకవర్గానికి ఒక పాఠశాలలో..
- దసరా సెలవుల తర్వాత అన్ని స్కూళ్లలో అమలు



రోజు వారీ మెనూ ఇలా..

సోమవారం	ఇడ్లీ–సాంబార్
మంగళవారం	పూరి –ఆలు కుర్మ
బుధవారం	ఉప్మా– సాంబార్
గురువారం	మిల్లెట్ ఇడ్లీ – సాంబార్
శుక్రవారం	ఉగ్గని, పోహా, మిల్లెట్ ఇడ్లీ– చట్నీ
శనివారం	పొంగల్–సాంబార్

నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పేరిట అల్పాహారం పథకం అమలుకు సర్కారు నిర్ణయించింది. ఈ పథకాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకుగాను సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,483 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలతోపాటు 17, మోడల్ స్కూళ్లు, 466 ఎయిడెడ్‌తో కలిపి మొత్తం 1,966 స్కూళ్లలో ఈ పథకం అమలు కానుంది.

తొలుత వారం రోజులు..

ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించేందుకు జిల్లాల్లో ఆరు నియోజక వర్గాల పరిధిలో ముందుగా ఒక్కో పాఠశాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో వారంరోజుల పాటు అల్పాహారం అందించనున్నారు. మరలా దసరా సెలవుల తరువాత జిల్లాలోని అన్ని పాఠశాల్లో అందించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తుంది. గ్రామీ ప్రాంత పేదపిల్లలు అధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుండడంతో వారికి ఉదయ పూట కూడా అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంట్లో భాగంగానే శుక్రవారం నుంచి అల్పాహారం పథకం అమలు కానుంది. అయితే విద్యార్థులకు ఉదయం 9 గంటలలోగా అల్పాహారం అందించనున్నారు.

ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో స్కూల్ ఎంపిక

దసరా సెలవుల వరకు ఈ వారం రోజులు ప్రభుత్వ పాఠశాల్లో సీఎం అల్పాహారం అందించేందుకు ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో స్కూల్‌ను ఎంపిక చేశారు. నల్లగొండ నియోజకవర్గ పరిధిలో నల్లగొండ పట్టణంలోని పద్మానగర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల, మునుగోడు పరిధిలోని చండూరు మండలం బంగారిగడ్డ హైస్కూల్, దేవరకొండలో ఎంపీపీఎస్, నకిరేకల్‌లో ఎంపీపీఎస్ బాలికలు, నాగార్జున సాగర్ నియోజక వర్గ కేంద్రంలోని ఎంపీపీఎస్ అనుముల, మిర్యాలగూడలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నుంచి అల్పాహారం పథకాన్ని ప్రారంభిస్తారు.

పథకం ప్రారంభానికి ఏర్పాట్లు చేయండి: కలెక్టర్



నల్లగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించేందుకు శుక్రవారం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు.. గురువారం అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, పౌర సరఫరాల అధికారులు, ఎంఈఓతో స్కూళ్లలో అల్పాహారం పథకం అమలు ఏర్పాట్లపై నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఆరు నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన ఆరు పాఠశాలల్లో అల్పాహారం ప్రారంభించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు.

నేటి నుంచి ఎడమ కాల్వకు నీటి విడుదల

- ప్రస్తుతం సాగులో ఉన్న పంటను కాపాడేందుకు ప్రభుత్వం నిర్ణయం



నాగార్జునసాగర్ ఎడమ కాలువ

నాగార్జునసాగర్: సాగర్ ఎడమ కాల్వకు శుక్రవారం నుంచి నీటిని విడుదల చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో బోర్లు, బావుల కింద నీటివసతి ఉన్న ప్రాంతాలలోని రైతులంతా వరినాట్లు వేశారు. అయితే, వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఆ పంటలను కాపాడుకునేందుకు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలని రైతులు కొన్ని రోజులుగా విజ్ఞప్తి చేశారు. రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం నీటిని విడుదల చేసేందుకు అంగీకారం తెలిపింది. ప్రస్తుతం ఒక తడికి నీటిని విడుదల చేసిన అనంతరం వాతావరణ పరిస్థితులను బట్టి 20 రోజుల తర్వాత మరో తడికి నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 525.10 అడుగుల(158.7393టీఎంసీలు) నీరు ఉంది.

లక్షన్నర ఎకరాలే సాగు

ఎడమ కాల్వ కింద 3.81లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ప్రతికూల పరిస్థితుల్లో కేవలం లక్షన్నర ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. రైతులు బోర్లు లోతుగా వేయించడం, బావులలో పూడికలు తీసి చేలను ఇప్పటి వరకు కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం చేలకు నీటి అవసరం పెరిగింది. వర్షాలు లేకపోవడంతో భూజలాలు తగ్గుముఖం పట్టాయి. బావులు, బోర్లలో నీరు తగ్గింది. కాలువకు నీటిని విడుదల చేయడం ద్వారా పొలాలకు సరిపోను నీరు చేరడంతోపాటు భూగర్భ జలాలు కొంతమేరకు పెరిగే అవకాశం ఉంది.

సగం మందికే రుణమాఫీ!

1.36 లక్షల మందికి జమకాని డబ్బులు

- కేవలం 1.63లక్షల మందికే రూ.1,037కోట్లు జమ
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- గ్రీవెన్స్ సెల్‌కు వెల్లువలా ఫిర్యాదులు



నల్లగొండలోని గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేస్తున్న రుణమాఫీ పడని రైతులు

నల్లగొండ అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రుణమాఫీ పథకం సగం మంది రైతులకే అందింది. జిల్లాలో వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చేసిన తప్పిదాలతో మిగతా సగం మంది అర్హులైన రైతులకు అందనే లేదు. దీంతో వారంతా తమ బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు ఎప్పుడు పడతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,00,769 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా బ్యాంకు అధికారులు ప్రభుత్వానికి జాబితా పంపించారు. వీరందరికీ రూ.2,693 కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 1,63,976 మంది రైతుల ఖాతాల్లో రూ.1,037కోట్లు జమ అయ్యాయి. మిగతా 1,36,793 మందికి రూ.1,655కోట్లకుపైగా రుణమాఫీ కావాల్సి ఉంది.

సాంకేతిక కారణాలతో జమకాని రుణమాఫీ సొమ్ము

ఒక్కో రైతు ఆధార్ నంబర్‌లో పలువురు రైతుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఒకే బ్యాంకు అకౌంట్ నంబర్లు ఉండడంతో పాటుగా వివిధ రకాల సాంకేతిక కారణాల వల్ల జిల్లా వ్యాప్తంగా అర్హులైన రైతులలో యాభై శాతంపైగా రైతులకు నేటికి రుణమాఫీ డబ్బులు జమకాలేదు. సెప్టెంబర్ నెలాఖరు వరకు రూ.లక్షలోపు రుణాలు ఉన్న అర్హులైన రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించి వారి ఖాతాల్లో జమచేస్తూ వచ్చింది. సెప్టెంబర్ తరువాత రూ.లక్షకు పైగా ఉన్న రుణాలను కూడా మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకు చాలామంది రైతులకు రూ.లక్షలోపు రుణాలు మాఫీ అయినప్పటికీ కొందరికి రూ.50వేల లోపు రుణాలు కూడా మాఫీకాలేదు. దీనికి కారణం అధికారులు చేసిన తప్పిదాలతో ఏర్పడిన సాంకేతిక సమస్య అని తెలుస్తోంది. అయితే రూ.లక్షకు పైగా ఉన్న రైతులకు, రూ.లక్షలోపు ఉన్న రైతులకు, రూ.యాభై వేలలోపు రుణాలు మాఫీ కావడంతో మిగతా రైతులు తమకు రుణమాఫీ అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో రుణమాఫీ కాని రైతుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశారు. అందులో వ్యవసాయ అధికారితో పాటు జూనియర్ అసిస్టెంట్‌ను నియమించారు. రుణమాఫీ కాని రైతులనుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను ఆయా బ్యాంకులకు పంపించి జరిగిన తప్పులను సరిచేసి వారికి రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువలా వస్తున్నాయి. దీంతో రైతుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నాలుగు కౌంటర్లను ఏర్పాటుచేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ



“జిల్లాలో ఉన్న అర్హులైన రైతులందరికీ రుణమాఫీ డబ్బులు జమకానున్నాయి. జరిగిన పొరపాట్లను సరిచేసి వారికి రుణమాఫీ అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు ఎవ్వరు కూడా ఆందోళన చెందొద్దు.

– చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు

గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తు చేశా..



“తనకు రూ.లక్షలోపు రుణం ఉంది. ఇప్పటికీ మాఫీ కాలేదు. బ్యాంకులో, వ్యవసాయ శాఖ కార్యాలయంలో అడిగిన సమాధానం చెప్పడం లేదు. ఎందుకు మాఫీ చేయలేదో అర్థం కావడం లేదు. గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకున్నాను.

– అంజయ్య, రైతు మిర్యాలగూడ

తెలంగాణలో బహుజన రాజ్యం స్థాపిస్తాం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



నకిరేకల్ : నీలి గర్జన సభలో అభివాదం చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ప్రియదర్శిని తదితరులు

నకిరేకల్: రానున్న ఎన్నికల్లో బీఎస్పీ సత్తాచాటి తెలంగాణలో బహుజన రాజ్యం స్థాపిస్తామని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేడి ప్రియదర్శినిని ఎంపిక చేసిన సందర్భంగా గురువారం నకిరేకల్‌లోని నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆ పార్టీ నీలి గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికార బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి ఘాటుగా విమర్శలు చేశారు. తెలంగాణను దోచుకున్న దొంగలు మీరు... రాబందులు మీరు.. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇంచు ప్రభుత్వ భూమి మిగలకుండా ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు కబ్జాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. నకిరేకల్‌లో మా సభ పెట్టుకునేందుకు ఫంక్షన్ హాల్ ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. సూర్యాపేటలో పోలీసులు అడుగుఅడుగునా ఆంక్షలు విధిస్తున్నారని, ఈ విషయంపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పోలీసుల సహకారంతో రిగ్గింగ్ చేసి గెలవాలని బీఆర్‌ఎస్ చూస్తోందని ఆరోపించారు. ఏ గ్రామాలు ఏకగ్రీవంగా కారు గుర్తుకు ఓటు వేస్తారో ఆ గ్రామాల ప్రజలకే ప్రభుత్వ పథకాలు ఇవ్వండి అని తాజా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హుకుం జారీ చేయడాన్ని ఖండించారు. దీనిపై ఎన్నికల కమిషన్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేడి ప్రియదర్శిని ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నక్క నిర్మల, జిల్లా అధ్యక్షుడు పూదరి సైదులు, జిల్లా నాయకులు బీంప్రసాద్, గద్దపాటి రమేష్, మర్రి శోభ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ పైనుంచి పడి మృతి


కుమార్ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని వెంగపాలెం వాగు వద్ద గురువారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన చీమల కుమార్ తన ట్రాక్టర్‌పై తాటిపాముల గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో వెంగపాలెం వాగు వద్దకు రాగానే ట్రాక్టర్ పైనుంచి జారి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

డెంగీతో మహిళ మృతి


యాదమ్మ (ఫైల్)

మోత్కూరు: డెంగీ జ్వరంతో మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన సామ యాదమ్మ (65) మృతిచెందింది. గత కొద్దిరోజులుగా యాదమ్మతో పాటు ఆమె కోడలు సునీత డెంగీ జ్వరంతో బాధపడుతున్నారు. యాదమ్మ కుమారుడు వెంకట్‌రెడ్డి ఆమెతో పాటు కోడలిని హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో వేర్వేరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా యాదమ్మ ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో సనత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. కిడ్నీలు, ఊపిరితిత్తులు చెడిపోయి బుధవారం సాయంత్రం మృతిచెందింది. గురువారం స్వగ్రామంలో యాదమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. సునీత ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో జ్వరాల బారిన పడుతున్నామని పలువురు గ్రామస్తులు తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రామగిరి(నల్లగొండ): కుటుంబ కలహాలతో విషం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన ఇటుకుల రాము కుటుంబంతో కలిసి తిప్పర్తి మండల కేంద్రంలో నివాసముంటూ కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో మధ్యాహ్నం రాము విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాము ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

- పారతో దాడి చేసిన నిందితుడు
- భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామంలో ఘటన

భువనగిరిక్రైం: భువనగిరి మండల పరిధిలోని తుక్కాపురం గ్రామంలో గురువారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుక్కాపురం గ్రామానికి చెందిన రాసాల రాజమల్లు, గుంటి బస్వయ్య (65) పక్క పక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. బస్వయ్య ఇంటి నిర్మాణం చేస్తుండగా.. కంకరను తన ఇంటి వైపు పోస్తున్నాడని రాజమల్లు అతడితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో మాటామాట పెరిగి క్షణికావేశంలో రాజమల్లు పక్కనే ఉన్న పారతో బస్వయ్యపై దాడి చేయడంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. అడ్డొచ్చిన బస్వయ్య భార్య తిరుపతమ్మపై కూడా దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు చికిత్స నిమిత్తం తిరుపతమ్మను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నిందితుడు రాజమల్లును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపుతున్నట్లు సీఐ తెలిపారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. సీఐ తెలిపారు. కాగా రాజమల్లు సైకోలా ప్రవర్తించేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. పదేళ్ల క్రితం అతడి భార్యపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి జైలుకు వెళ్లి వచ్చాడని గ్రామస్తులు తెలిపారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కొంతకాలం బాగానే ఉన్న రాజమల్లు ఈ హత్య చేయడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు.


ఘటనా స్థలంలో బస్వయ్య మృతదేహం

మహిళ అదృశ్యం.. కేసు నమోదు


మల్లికా బీ

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన మహిళ బుధవారం అదృశ్యమైంది. గురువారం త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని అలగడప గ్రామానికి చెందిన మల్లికా బీ(29)కి త్రిపురారం మండల కేంద్రానికి చెందిన హబీబ్ పాషతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. హబీబ్ పాష బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రించి సాయంత్రం 3గంటలకు లేచి చూసేసరికి భార్య మల్లికా బీ కనిపించలేదు. 'నేను చనిపోతున్నాను' అని మల్లికా బీ రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో దొరకడంతో వెంటనే హబీబ్ పాష త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మల్లికా బీ బుర్కా ధరించి ఉందని, ఆమె 5 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు ఉంటుందని భర్త హబీబ్ పాష తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 8712670196 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

మామిడాలలో యువకుడు..


కందుల నవీన్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన కందుల నవీన్ అదృశ్యమైనట్లు గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుల నవీన్ ఎవరికీ చెప్పకుండా ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం నవీన్ సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ కావడంతో అతడి తండ్రి కందుల చారయ్య తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

అడ్డగూడూరు: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బొడ్డు బాలస్వామి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం బాలస్వామి ట్రాక్టర్ నడుపుకుంటూ పొలం వద్దకు వెళ్తుండగా స్థానికంగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాలస్వామికి వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ఆర్థికసాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సాయం చేయదల్చిన వారు 98480 54223 నంబర్‌కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాలస్వామి

వేర్వేరు చోట్ల ఉరేసుకొని ఇద్దరి బలవన్మరణం


నాగరాజు (ఫైల్)

చౌటుప్పల్: ఆర్థిక సమస్యలతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్ల నాగరాజుయాదవ్ (32) స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. వైవాహిక జీవితంలో గొడవల కారణంగా అతడు మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లోనే చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

భువనగిరిలో...


వెంకటేష్ (ఫైల్)

భువనగిరి క్రైం: పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన గాజు వెంకటేష్(29) గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ రెండు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా.. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటేష్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జేబులో దొరికిన సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

పత్తి లోడుతో వెళ్తున్న లారీ బోల్తా


తొగర్రాయి గ్రామ శివారులోని మలుపు వద్ద బోల్తాపడిన లారీ

కోదాడరూరల్: కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి గ్రామ శివారులో కోదాడ–మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై పత్తి లోడుతో వెళ్తున్న లారీ గురువారం బోల్తా పడింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని కంచికచర్ల నుంచి గుజరాత్‌కు పత్తి లోడుతో వెళ్తున్న లారీ తొగర్రాయి గ్రామ శివారులో ఉన్న భారీ మూలమలుపు వద్దకు రాగానే బోల్తా పడింది. లారీ బోల్తా పడుతుండటాన్ని గమనించిన డ్రైవర్ కిందకు దూకడంతో అతడికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

- జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

యాదగిరిగుట్ట: పట్టణ పరిధిలోని యాదగిరిపల్లిలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్‌లో పనిచేసే ఉద్యోగి.. అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అతనిని సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ షఫియాజ్ అక్తర్ గురువారం తెలిపారు. వివరాలు.. గతంలో వీఆర్వోగా పనిచేసిన డి. శ్రీనివాస్ గతేడాది ఆగస్టులో వీఆర్వోల సర్దుబాటులో భాగంగా యాదగిరిగుట్ట పాలిటెక్నిక్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లోకి చేరాడు. జూనియర్ అసిస్టెంట్‌తో పాటు బాలుర, బాలికల హాస్టల్‌లో డే మ్యాట్రన్(సూపర్‌వైజర్)గా సైతం బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో బుధవారం సాయంత్రం కళాశాలలో ఉన్న ఓ విద్యార్థిని చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు గురువారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రాథమిక విచారణ జరిపి డి. శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశామని, శాఖాపరమైన విచారణకు ఆదేశించామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. విచారణ నివేదిక రాగానే అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇగ్నో కోర్సులు సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ): ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఐజీఎన్‌ఓయూ–ఇగ్నో) ద్వారా అందిస్తున్న కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ రీజనల్ సెంటర్ అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాజు బోళ్ల అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల నందు జరిగిన కోర్సుల ప్రమోషనల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, మాస్టర్స్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులలో చేరడానికి దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎలాంటి కోర్సు ఫీజు లేకుండా ఉచితంగా ప్రవేశం పొందవచ్చన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం రెగ్యులర్ కోర్సు చదువుతున్న విద్యార్థులు కూడా ప్రవేశాలు తీసుకోవచ్చని అన్నారు. కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తు గడువును అక్టోబర్ 10 వరకు పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఎలాంటి రుసుము లేకుండా డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలు పొందే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు www.ignou.ac.in వెబ్‌సైట్‌ను లేదా 9492451812, 040 23117550 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు పి. శ్రీనివాస్, ఏ. అమృతారెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

రామన్నపేట: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రామన్నపేట మండలంలోని సిర్సెముల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. సిర్సెముల గ్రామానికి చెందిన సుర్వి లక్ష్మమ్మ కుమారుడు సతీష్(27) ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం లక్ష్మమ్మ కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. తలుపు తీసి చూసేసరికి సతీష్ మృతిచెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కేంద్ర ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే వ్యక్తులు, సంఘాలు, మేధావులపై అక్రమంగా కేసులు పెట్టి జైలులో పెడుతున్నారని, ముఖ్యంగా పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యూస్‌క్లిక్ వెబ్‌సైట్ కార్యాలయంతో పాటు అందులో పనిచేసే సిబ్బంది ఇళ్లపై, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అధికారిక నివాసంలో ఎలాంటి అనుమతులు లేకుండా సోదాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద న్యూస్‌క్లిక్ వెబ్‌సైట్ ఎడిటర్ ప్రబీర్, హెచ్‌ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించాలన్నారు. తెలంగాణలో సంక్షేమ పథకాల పేరుతో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అక్రమంగా దోచిపెడుతున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతూ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నచందంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. గత నెల రోజులుగా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు ఆందోళన చేస్తున్నారని.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వారితో చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధీరావత్ రవినాయక్, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి


ఎంజీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసనకు మద్దతు తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల జేఏసీ పిలుపు మేరకు మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేపట్టిన నిరసన గురువారం కూడా కొనసాగింది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు మద్దతుగా పలు విద్యార్థి సంఘాలు యూనివర్సిటీలో తరగతులను బహిష్కరించారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ అధ్యాపకులతో పాటు విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ, స్వేరో విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం ఆధునిక బానిసత్వంగా ఉందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం ఉండదని ఉద్యమ సమయంలో చెప్పిన కేసీఆర్ నేటికీ అదే విధానం అమలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దయాకర్, అభినవ్, స్వేరో నాయకులు ఆదర్శ్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

మిమిక్రాఫ్ట్ కంపెనీని సందర్శించిన విద్యార్థులు


డిజైన్‌ల గురించి విద్యార్థినులకు వివరిస్తున్న డిజైనర్ కృష్ణమూర్తి

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో గల అపెరల్ టెక్స్‌టైల్ పార్కులోని మిమిక్రాఫ్ట్ కంపెనీని గురువారం హైదరాబాద్‌లోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో టెక్నిక్స్ అఫ్ ఫ్యాబ్రిక్ కన్‌స్ట్రక్షన్ కోర్సు అభ్యసిస్తున్న 48 మంది విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ తయారవుతున్న వివిధ రకాల వస్త్రాలపై అధ్యయనం చేశారు. ప్రాచీన హస్తకళలను నేటి తరానికి అందిస్తున్న స్క్రీన్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్, బోటిక్ ప్రింటింగ్, టై అండ్ డై ప్రింటింగ్‌లతో కూడిన వస్త్రాలను ఫ్యాషన్ డిజైనర్ కె. కృష్ణమూర్తి, యూనిట్ నిర్వాహకురాలు పుష్పలత వివరించారు. అదేవిధంగా ప్రకృతి సహజ సిద్ధమైన రంగులతో వస్త్రాలను తయారుచేసే విధానాన్ని మండలంలోని కొయ్యలగూడెం గ్రామానికి దుద్యాల శంకర్ విద్యార్థినులకు తెలియజేశాడు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. యువకుడు దుర్మరణం


నర్సిరెడ్డి (ఫైల్)

మిర్యాలగూడ: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఎదుట గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్లకు చెందిన అనిపిరెడ్డి నర్సిరెడ్డి(30) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టర్ వద్ద సేఫ్టీ విభాగంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం విధులకు వెళ్లేందుకు దామరచర్ల వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి నర్సిరెడ్డి వెనుక కూర్చున్నాడు. పవర్ ప్లాంట్‌కు సమీపంలోకి వెళ్లగానే వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా వెనుక కూర్చున్న నర్సిరెడ్డి లారీ కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నర్సిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని రోదించారు. నిర్లక్ష్యంగా లారీని నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మృతి

రామగిరి(నల్లగొండ): తండ్రి మందలించాడని మనస్తాపంతో గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన జరిపోతుల సంతోష్(20) మాడుగులపల్లి సమీపంలో గల టోల్‌ప్లాజాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం చేయగా వచ్చిన జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా దుబారాగా ఖర్చు చేస్తున్నావని సంతోష్‌ను గత నెల 15న తండ్రి వెంకన్న మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకొచ్చిన మూడు రోజుల తర్వాత అతడి ఆరోగ్యం విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఈ నెల 3న ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ అతడు అనారోగ్యానికి గురికావడంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపారు.

వరిలో ఎలుకల నివారణ పద్ధతులు



నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగు చేస్తున్న వరి పంటలో ఎలుకలు చేరి పంటను నష్టపరుస్తున్నాయి. గట్ల సంఖ్యను, పరిమాణాన్ని వీలైనంత వరకు తగ్గించడం ద్వారా ఎలుకల నివాస స్థావరాలను తగ్గించవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు అంటున్నారు.

- పొలం గట్లపై గడ్డి, కలుపు లేకుండా శుభ్రపరుచుకోవాలి. గట్లను పదునైన పారతో చెక్కుకోవాలి. ఎలుకల బుట్టలను నారుమడి పోసిన దగ్గర నుంచి దమ్ములు పూర్తయిన తర్వాత నాట్లు వేసిన ఒక నెల వరకు మరియు కోతల తర్వాత ఎకరానికి 20 చొప్పున పెట్టినచో ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చు.

నివారణ చర్యలు

- పంట తక్కువగా ఉన్న సమయంలో పొలాల్లో ఎరను చేపడితే ఎలుకల సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చు. ఆ సమయంలో ఆహారం తక్కువగా ఉన్నందున ఎలుకలు ఎరను తినడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. పంట కాలంలో విషపు ఎరలను చిరుపొట్ట దశ ఏర్పడకముందే ఉపయోగించాలి.

బ్రోమడయోలోన్: బ్రోమడయోలోన్ ఎరను 10–15 గ్రాముల(96శాతం నూకలు, 2శాతం నూనె 2శాతం మందు) పొట్లాలుగా కట్టి కన్నంలో ఒకటి చొప్పున పెట్టాలి. ఈ ఎరను పది రోజుల వ్యవధితో పైరు చిరుపొట్ట దశకు వచ్చే వరకు రెండుమూడు సార్లు వాడవచ్చు.

పాడి పంట

ఎర స్థావరాలు: బ్రోమడయోలోన్ ఎరను ఎర స్థావరాలలో ఉంచి వాడటం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చు. ఎకరానికి 5–6 పీవీసీ పైపు ఎర స్థావరాలను(3 అంగుళాల వ్యాసం, 1.5 అడుగు పొడవు) పొలానికి నాలుగు మూలల గట్లపై అమర్చుకోవాలి. వీటిలో బ్రోమడయోలోన్ ఎర మందు 30 గ్రాముల చొప్పున వేయాలి. వారానికి రెండు సార్లు మందును మార్చుకోవాలి. ఈ పద్ధతిని వరి నాట్లు వేసిన దగ్గర నుంచి చిరుపొట్ట దశ వరకు అవలంబించాలి. ఇటువంటి ఎర స్థావరాల్లో ఉంచిన విషపు ఎర ఎండ, వానలకు పాడవ్వకుండా ఉండడమే కాకుండా పెంపుడు జంతువులకు, పక్షులకు ఏవిధమైన హాని జరగదు. ఈ ఎర స్థావరాలను అమర్చి ముందుగా విత్తిన వరి నారుమళ్లను కూడా ఎలుకల బారి నుంచి సమర్థవంతంగా కాపాడుకోవచ్చు.

జింకు ఫాస్పైట్ ఎర: ఎలుకల ఉధృతి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు పంట కాలంలో ఒక్కసారి మాత్రమే జింకు ఫాస్పైట్ ఎరను వాడాలి. దీనికి ముందుగా విషం లేని ఎరను 20 గ్రాములు (98శాతం నూకలు, 2శాతం నూనె) పొట్లాలుగా కట్టి కన్నానికి ఒకటి చొప్పున పెట్టి రెండు రోజుల ఎలుకలను మచ్చిక చేసుకోవాలి. మూడవ రోజు జింకు ఫాస్పైట్ ఎరను 10 గ్రాములు (96శాతం నూకలు, 2శాతం నూనె, 2శాతం మందు) పొట్లాలు కట్టి కన్నంలో ఒకటి చొప్పున వేయాలి.

బర్రోఫ్యూమిగేటర్ (పొగబారించే యంత్రం): పంట ఏ దశలోనైనా ఎలుకల కన్నాలలో పొగను బర్రోఫ్యూమిగేటర్ ద్వారా వదిలి సులువుగా చంపవచ్చు. పొగను వదిలేటప్పుడు కన్నం చుట్టూ ఉన్న పగుళ్ల మట్టితో మూసివేసి, పొగను కనీసం మూడు నిమిషాలు వదలాలి. ఎలుకలు రసాయనిక ఎరలను స్వీకరించని సమయాల్లో కూడా దీని ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. పంట ఈనిన దశలో పొగ బారించడం ద్వారా ఒకే కన్నంలో వివిధ దశలలో ఉన్న ఎలుకలను, చూడు ఎలుకలను నిర్మూలించి తదుపరి సీజన్‌లో వాటి ఉధృతిని తగ్గించవచ్చు. వీటి ధర రూ.1200 నుంచి రూ.1400 వరకు ఉంటుంది.